సన్నగిల్లుతున్న ఆశలు

- ఏటా తగ్గుతున్న వేరుశనగ సాగు విస్తీర్ణం
- పెరిగిపోతున్న పెట్టుబడి భారం
- నష్టాలతో కుదేలవుతున్న రైతులు

తనకల్లు: సంప్రదాయ పంట వేరుశనగపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. సాగుకు వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం.. వరుసగా నష్టాలు వస్తుండడంతో రైతులు సాగుకు ఆసక్తి చూపడం లేదు. తనకల్లు మండల వ్యాప్తంగా రబీ సాధారణ సాగు విస్తీర్ణం 1,500 హెక్టార్లు. ఇందులో అత్యధికంగా 550 హెక్టార్లలో రైతులు బోర్లు, బావుల కింద వేరుశనగ సాగు చేస్తారు. అయితే ఏటేటా వేరుశనగ సాగు విస్తీర్ణం తగ్గిపోతూ వస్తోంది. గత రబీలో 330 హెక్టార్లలో వేరుశనగ సాగైంది. ప్రస్తుత రబీ సీజన్‌లో ఇప్పటి వరకు 146 హెక్టార్లలో మాత్రమే సాగు చేసినట్లు వ్యవసాధికారులు తెలిపారు. రబీలో వేరుశనగ పంట సాగు 50 శాతానికి పైగానే తగ్గిపోయింది.

భారమవుతున్న పెట్టుబడులు

ఇది వరకు రబీ సీజన్‌లో బోర్లు, బావుల కింద విస్తారంగా వేరుశనగ చేసేవారు. అయితే నేడు ఆ పరిస్థితులు లేవు. నామమాత్రంగానే సాగు చేస్తున్నారు. దీనికి కారణం విపరీతంగా పెరిగిన పెట్టుబడులు, ఇతర ఖర్చులేనని రైతులు చెబుతున్నారు. విత్తనాలు, ఎరువులు, మందులు, కూలీల ఖర్చులు కలుపుకొని ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు ఖర్చు వస్తుంది. పెట్టుబడులు పెరిగిపోవడంతో రైతులు వేరుశనగ సాగుపై దృష్టి పెట్టడం లేదు. ఒకవేళ అప్పులు చేసి పంట సాగు చేసినా దిగుబడి లేకపోవడం, గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో వేరుశనగ సాగు పట్ల రైతులు ఆసక్తి చూపడం లేదు.


దేగానివారిపల్లి వద్ద సాగు చేసిన వేరుశనగ పంట

నష్టాలు వస్తున్నాయి



వేరుశనగ సాగు చేయాలంటే ఎక్కువ పెట్టుబడి పెట్టాలి. ఎకరాకు 10 బస్తాలు దిగుబడి వచ్చేది కూడా కష్టమే. వేరుశనగ సాగులో నష్టాలు తప్ప లాభాలు లేవు. దీంతో రబీలో వేరుశనగ సాగు పట్ల దృష్టి పెట్టడం లేదు.

– హిమధర్‌రెడ్డి, రైతు, సున్నంపల్లివారిపల్లి

ఆశించిన దిగుబడి లేదు



వేరుశనగ సాగులో పెట్టుబడులు భారమవుతున్నాయి. ఎకరాకు కనీసం రూ.30 వేలకు పైగానే ఖర్చవుతుంది. ఆశించిన దిగుబడులు రావడం లేదు. దీంతో వేరుశనగను సాగు చేస్తే నష్టాలు తప్ప లాభాలు లేవు. అందుకే టమాట సాగు చేసుకుంటున్నా.

– జయరామిరెడ్డి, రైతు, మండ్లిపల్లి

ప్రత్యామ్నాయ పంటలతో లాభాలు



రబీలో రైతులు బోరుబావుల కింద ఎక్కువగా వేరుశనగ సాగు చేసేవారు. ప్రస్తుతం ప్రత్యామ్నయ పంటలైన మొక్కజొన్న, సజ్జ, టమాట, కూరగాయల పంటలు సాగు చేస్తూ లాభాలనార్జిస్తున్నారు. – శ్రీహరినాయక్, ఏఓ, తనకల్లు

క్లుప్తంగా

ఖాద్రీ ఆలయంలో ప్రత్యేక పూజలు


దీపాలు పెడుతున్న మహిళలు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కదిరి పరిసర ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, కడప, చిత్తూరు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. మహిళలు ఆలయం ముందు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారులు భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు.

రోడ్డు నిబంధనలు పాటించండి


వాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి అర్బన్: ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని ప్రమాదాలను నివారించాలని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు ఆర్టీఓ వీవీఎస్ శర్మ హాజరై మాట్లాడారు. ప్రభుత్వం నిబంధనలు రూపొందించింది మన భద్రత కోసమే అన్నారు. పలువురు వక్తలు రోడ్డు భద్రతా నిబంధనలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. అనంతరం వాహనాల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీఓ శ్రీనివాసులు, అసిస్టెంట్ ఎంవీఐ రాజేష్, వాల్మీకి విద్యాసంస్థల అధినేతలు పవన్‌కుమార్‌రెడ్డి, అనిల్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై అధికారులు దృష్టి సారించాలి


అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

అమడగూరు: ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఓడీచెరువులోని వెంకటసాయి ఐటీఐ కళాశాలలో ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామస్తుల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐలు మల్లికార్జునరెడ్డి, వెంకటనారాయణ, తహసీల్దార్ అనంతాచారి, ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టాలి


సేవాలాల్ చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న నాయకులు

పుట్టపర్తి టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని లంబాడీ హక్కుల సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు రవినాయక్ డిమాండ్ చేశారు. శనివారం సత్యసాయి సూపర్ స్పెషాలిటీ వద్ద ఉన్న లంబాడీ హక్కుల పోరాట సమితి కార్యాలయంలో సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవాలాల్ జయంతి అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు విజయకుమార్‌నాయక్, నాయకులు మోహన్‌నాయక్, రమేష్ నాయక్, గణేష్‌నాయక్, చంద్రశేఖర్‌నాయక్, శ్రీరాములునాయక్, బాలాజీనాయక్, చందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై దాడులు చేస్తే సహించం

ధర్మవరం రూరల్: ప్రభుత్వ ఉద్యోగులపై దాడులను చేస్తే సహించమని ఎంపీడీఓ సాయి మనోహర్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల పోతుకుంట సచివాలయంలో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్‌పై కొందరు దాడికి యత్నించారన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా సచివాలయ ఉద్యోగులపై దాడులు, వేధింపులకు పాల్పడితే తక్షణం తనకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

చెన్నకేశవుడికి మాజీ ఎమ్మెల్యే పూజలు


స్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: బుక్కపట్నం మండలం చెండ్రాయునిపల్లి సమీపంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరుగు వంశీయలు, పూజరుల ఆధ్వర్యంలో తడకోత్సవం జరిగింది. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే బుక్కపట్నం ఎంపీపీ శ్రీధర్‌రెడ్డితో కలిసి స్వామిని దర్శించుకున్నారు. నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని దేవుడిని కోరుకున్నట్లు మాజీ ఎమ్మెల్యే తెలిపారు.

అధికారుల తీరుపై కౌన్సిలర్ల మండిపాటు


వార్డు సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్తున్న కౌన్సిలర్లు

పుట్టపర్తి టౌన్: మున్సిపల్ అధికారుల పనితీరుపై కౌన్సిలర్లు మండిపడ్డారు. పన్నుల వసూలు, పారిశుధ్య నిర్వహణ విషయంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారంటూ దుయ్యబట్టారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశం మందిరంలో మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి ఆధ్యక్షతన కమిషనర్ ప్రహ్లాద ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. ఎక్స్అఫిషియో సభ్యురాలి హోదాలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా కౌన్సిలర్లు పలు సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. రూ.10 కోట్లు పన్ను వసూలు కావాల్సి ఉండగా కేవలం రూ.2 కోట్లు వసూలు చేస్తే అభివృద్ధి కార్యక్రమాలు ఎలా చేపట్టాలని అధికారులను నిలదీశారు. 5వ వార్డు కౌన్సిలర్ సూర్యాగౌడ్ మాట్లాడుతూ పట్టణంలో చాలా అపార్టుమెంట్లకు కొన్నేళ్లుగా ట్యాక్స్‌లు వేయలేదని దీంతో మున్సిపల్ ఆదాయానికి గండిపడుతోందన్నారు. చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించకుండా ఎక్కడ పడితే అక్కడ వేస్తున్నారన్నారు. పట్టణంలో పందుల సంచారాన్ని నియంత్రించాలని కోరారు. 4వవార్డు కౌన్సిలర్ చెరువు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ కౌన్సిలర్లకు అధికారులకు మధ్య సమన్వయ లోపంతో వార్డుల్లో ఎలాంటి పనులు జరగడంలేదన్నారు. భక్తుల సౌకర్యార్థం పబ్లిక్ టాయిలెట్లు వినియోగంలోకి తీసుకరావలని కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన కమిషనర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే అజెండాలోని అంశాలపై ఎలాంటి చర్చ లేకుండానే కౌన్సిల్ ఆమోదం లభించింది.

బాబా జయంత్యుత్సవాల ఏర్పాట్లు చేయండి

సత్యసాయిబాబా జయంత్యుత్సవాలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అధికారులను కోరారు. ప్రధానంగా తాగునీరు, వీధిదీపాలు, భూగర్భడ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. టాయిలెట్లు, చిత్రావతి బ్యూటిఫికేషన్, ఫుడ్ కోర్టులు, ఫోటోగ్యాలరీ ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తిప్పన్న, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలతోపాటు ఇళ్లు నిర్మించాలి


మాట్లాడుతున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు

ధర్మవరం: పేదలకు ఇంటి స్థలాలతోపాటు పక్కా గృహాలను ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎన్జీవో హోంలో శనివారం సీపీఐ పట్టణ, రూరల్ మండల శాఖ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 40 వార్డుల్లో చాలా మంది పేదలకు ఇంటి స్థలాలు లేవన్నారు. కొంత మందికి ఇంటి పట్టాలున్నా ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే నగదు సరిపోకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అర్హులకు గ్రామాల్లో 3, పట్టణాల్లో 2 సెంట్ల ప్రకారం స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు నగదుతోపాటు కంకర, ఇసుక, సిమెంట్, ఇనుమును ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి రవి, చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, యువజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా, మహిళా సమైక్య అధ్యక్షురాలు లలితమ్మ, కార్యదర్శులు లింగమ్మ, భవాని, నారాయణమ్మ, సీపీఐ పట్టణ నాయకులు శ్రీధర్, ఆదెప్ప, రంగయ్య ఉన్నారు.

‘ఉపాధ్యాయుల అటెండెన్స్ లాక్ సరికాదు’

ఎన్పీకుంట: ఉపాధ్యాయులకు శనివారం నిర్వహించిన క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల క్లోజింగ్ సమయం సాయంత్రం 5 గంటలు ఉన్నప్పటికీ 6 వరకు అటెండెన్స్ పడకుండా లాక్ చేయడం సరికాదని వైఎస్సార్‌టీఏ నాయకులు గంగాధర్‌రెడ్డి, ఆంజనేయులునాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి విధులకు హాజరైన ఉపాధ్యాయులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఇబ్బందులు పడ్డారన్నారు. ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం ఇంత దారుణంగా ప్రవర్తించడం సమంజసం కాదని తెలిపారు. క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల సమయాన్ని 4 గంటల వరకే కుదించాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

నల్లచెరువు: గాజేఖాన్ పల్లి సమీపంలోని శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు..గాజేఖాన్‌పల్లికి చెందిన ఆంజనేయులు నల్లచెరువులో పని ముగించుకుని కాలినడకన స్వగ్రామానికి బయలుదేరాడు. గాజేఖాన్ పల్లి సమీపంలోని జాతీయ రహదారి దాటుతుండగా తనకల్లు వైపు నుంచి కదిరికి వెళ్తున్న బైక్ అతడిని ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆంజనేయులును స్థానికులు కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గుండెపోటుతో సీనియర్ అసిస్టెంట్ మృతి


జయనాయక్

లేపాక్షి/సోమందేపల్లి: లేపాక్షి మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జయ నాయక్ (50) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన స్వగ్రామం గోరంట్ల మండలం కరావులపల్లి తండా. ఇంట్లో తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు పుట్టపర్తికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గతంలో ఆయన గోరంట్ల ఎంపీడీఓ కార్యాలయంలో విధులు నిర్వహించారు. జయనాయక్ మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

18న వాహనాల వేలం

హిందూపురం అర్బన్: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 18న వేలం పాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ రామ్మోహన్ శనివారం తెలిపారు. వేలంలో పాల్గొనే వారు నిర్ణీత రుసుం చెల్లించాలని పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


సోక్‌పిట్ల నిర్మాణంపై ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం


తనకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


చెన్నేకొత్తపల్లిలో పరిసరాలను శుభ్రం చేస్తున్న అధికారులు

తనకల్లు: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఎంపీడీఓ రెడ్డెప్ప అన్నారు. స్థానిక జాతీయ రహదారిపై శనివారం విద్యార్థులతో కలిసి స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్తను, ప్లాస్టిక్ కవర్లను పడేయరాదన్నారు. అందరూ మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలన్నారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, కార్యదర్శి కృష్ణమూర్తిరెడ్డి, ఎంపీహెచ్ఈఓ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ రఘునాథ గుప్త, తహసీల్దార్ రవికుమార్ అన్నారు. సర్పంచ్ పంచరత్నమ్మ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీబీవీ పాఠశాల విద్యార్థులతో పాటు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా అధికారులు విద్యార్థులతో కలిసి స్థానిక చెత్త సంపద కేంద్రాన్ని సందర్శించారు. ఈఓఆర్డీ శకుంతల, కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

గాండ్లపెంట: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి కోరారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక చెత్త సంపద తయారీ కేంద్రం వద్ద విద్యార్థులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ రహంతుల్లా, కార్యదర్శి బాషా పాల్గొన్నారు.

తాడిమర్రి: ఇంటి పరిసరాల్లో సోక్‌పిట్లు తవ్వుకుని మురుగునీరు, వర్షపునీటికి చెక్ పెట్టాలని డ్వామా పీడీ విజయ్ ప్రసాద్ పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం ఆయన స్థానిక ఎస్సీ కాలనీలో సోక్‌పిట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకుడు గుంతలు నిర్మించుకునే వారికి ప్రభుత్వం రూ.5,500 అందిస్తుందని తెలిపారు. డ్వామా ఏపీడీ వెంకటాచలపతి, ఎంపీడీఓ వెంకట రంగారావు, ఈఓఆర్డీ విజయశేఖర్ నాయుడు, ఏపీఓ సంజీవరెడ్డి, ఈసీ అశోక్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా ఎంఈఓ కృష్ణమోహన్ అధ్యక్షతన మండల కేంద్రంలో జరిగిన విద్యార్థుల ర్యాలీకి ఎంపీడీఓ వెంకట రంగారావు హాజరై మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతతోనే రోగాలు దూరమవుతాయని, ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈఓపీఆర్డీ విజయశేఖర్ నాయుడు, ఎంఈఓ 2 వెంకటేష్, ఏపీఓ సంజీవ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం ఎంపీడీఓ నరసింహనాయుడు సిబ్బందితో కలిసి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చెత్త తొలగించారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి శ్రీనివాసులు, ఈఓఆర్డీ క్రిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎన్పీకుంట: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ అంజినప్ప పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్‌లో భాగంగా విద్యార్థులతో నిర్వహించారు. సర్పంచ్ అంజినమ్మ, ఈఓపీఆర్డీ మాధవరెడ్డి, హెచ్ఎం శిరీషారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం

కనగానపల్లి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని ఎంపీడీఓ అనిల్‌కుమార్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం పంచాయతీ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్యక్రమాలు, పరిశుభ్రతపై విద్యార్థులతో కలసి అవగాహన ర్యాలీ చేపట్టారు. కనగానపల్లిలో జరిగిన కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అంకె రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

అమడగూరు(ఓడీచెరువు): పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ పేర్కొన్నారు. శనివారం ఓడీచెరువు మండలం డబురువారిపల్లిలో జరిగిన స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్‌కు ఆమె హాజరై పోస్టర్లను విడుదల చేశారు. హెచ్ఎం చంద్రమౌళి, కార్యదర్శి సందీప్, వీఆర్ఓ వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం తన కార్యాలయ ఆవరణలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగం పిచ్చి మొక్కలు తొలగించారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె సూచించారు. ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ నివేదిత, డిప్యూటీ డెమో వీరమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’

ధర్మవరం అర్బన్: ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్డీఓ మహేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మవరం డివిజన్ పరిధిలోని అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలని సూచించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి

చెన్నేకొత్తపల్లి: ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ శివశంకర్ ప్రజలకు సూచించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కేంద్రాల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ నిర్వహించారు. చెన్నేకొత్తపల్లిలో ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. అనంతరం అధికారులు పారిశుధ్య కార్మికులతో కలసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిసరాలలోని చెత్తను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అశోక్ కుమార్ నాయక్, పంచాయతీ ఈఓ నారాయణస్వామి, ఎంఈఓ ప్రసూన్‌కుమార్ నాయుడు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధిహామీ పని దినాల పెంపు

కనగానపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో కూలీల పని దినాలను మరో 50 రోజులు పెంచినట్లు ఎంపీడీఓ అనిల్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీఓ వెంకటేష్‌తో కలసి ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో కనగానపల్లి ఉందన్నారు. దీంతో ప్రభుత్వం కరువు మండలాల పరిధిలోని గ్రామాల్లో వంద రోజుల పాటు మరో 50 రోజులు పని దినాలు అదనంగా కేటాయించడం జరిగిందన్నారు. ఈ పని దినాలను వచ్చే మార్చి 31లోగా పూర్తి చేసుకోవాలని కూలీలకు సూచించారు.

సర్పంచ్‌కు మాజీ ఎమ్మెల్యే పరామర్శ


సర్పంచ్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: అనారోగ్యంతో బాధపడుతున్న వెంగళమ్మచెరువు సర్పంచ్ వెంకటేషును మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఇటీవల ఆసుపత్రి నుంచి ఇంటికి చేరుకున్న సర్పంచ్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం అదే గ్రామంలో ఇటీవల మృతి చెందిన పార్టీ నేత సంజీవ్ ఇంటికి చేరుకుని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే వారికి భరోసా కల్పించారు. ఆయన వెంట మండల కన్వీనర్ నరసారెడ్డి, నాయకులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీని బలోపేతం చేద్దాం


మాట్లాడుతున్న పార్టీ మండల కన్వీనర్ మీనుగ నాగరాజు

రామగిరి: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేద్దామని పార్టీ మండల కన్వీనర్ మీనుగ నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని ఎంసీపల్లిలో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. హామీల అమలులో విఫలమైనట్లు మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్దన్న, ఎంపీటీసీ రామ్మోహన్, మండల అగ్రిబోర్డ్ చైర్మన్ నరసింహారెడ్డి, ఎజ్జె ఆంజనేయులు, నర్సిరెడ్డి, మహాత్మా, వైస్ సర్పంచ్ దేవభూషణ్ రెడ్డి, నారాయణ రెడ్డి, కురుబ సుదప్ప పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి


మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కదిరి టౌన్: ఏప్రిల్ 22, 23, 24 తేదీల్లో కదిరిలో తలపెట్టిన భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ(ఆర్‌సీపీఐ) ప్రథమ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆర్.సతీష్ కోరారు. ఈమేరకు శనివారం ఎన్జీవో హోంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. మహాసభలకు పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు,కార్మికులు, రైతులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు డాక్టర్ నాగన్న, కార్యదర్శులు బాలకృష్ణ, రవిరాజు, అంజినమ్మ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల అడ్డగింత


హైవే పనులను అడ్డగించిన గ్రామస్తులు

ముదిగుబ్బ: తమ గ్రామానికి దారి లేకుండా గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులను చేపడుతున్నారని మలకవేమల గ్రామస్తులు శనివారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రామచంద్రారెడ్డి, పత్తిరెడ్డి మాట్లాడుతూ తమ గ్రామానికి రాకపోకలకు సాగించేందుకు చిన్న వంతెన మాత్రమే ఏర్పాటు చేశారన్నారు. రోడ్డుకు అటువైపు వందల ఎకరాల వ్యవసాయ పొలాలున్నాయన్నారు. చిన్నవంతెనతో పంట ఉత్పత్తులు ఇళ్లకు ఎలా తెచ్చుకోవాలని ప్రశ్నించారు. దీనిపై ఇంజినీర్లను సంప్రదించినా ప్రయోజనం లేకపోవడంతోనే పనులు అడ్డుకుంటున్నామన్నారు.

మండల సమాఖ్య సభ్యులకు శిక్షణ

ముదిగుబ్బ: స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం క్రాంతి మండల సమాఖ్య సభ్యులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్టేట్ రిసోర్స్ పర్సన్ ఈశ్వరమ్మ, సరస్వతి మండల సమాఖ్య నిర్మాణం, సమావేశం అజెండా, విధులు, బాధ్యతలు తదితర విషయాలను వివరించారు. కదిరి ఏరియా కోఆర్డినేటర్ వెంకటనారాయణ, ఏపీఎం హేమలత సిబ్బంది పాల్గొన్నారు.